రైతుపై 'పచ్చిరొట్ట' భారం

- అమాంతం పెరుగనున్న ధరలు
- 30 కిలోల జీలుగ బస్తా రూ.2,137
- గతేడాది బస్తా రూ.1,116
- లబోదిబోమంటున్న రైతులు



వీణవంకలో సాగు చేసిన జీలుగ(ఫైల్)

వీణవంక: భూసారం పెంచేందుకు ప్రభుత్వం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తోంది. తద్వారా రసాయన ఎరువుల వాడకం చాలా వరకు తగ్గుతుంది. మే 25న రోహిణి కార్తె ప్రవేశించనుంది రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. మే 15 నుంచి రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేయాల్సింది. గతేడాది 60 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించగా ఈసారి 10 శాతం సబ్సిడీని ఎత్తేసి 50 శాతంకు కుదించారు. ఈ మేరకు ధరలను కూండా పెంచుతూ వ్యవసాయశాఖ నుంచి అధికారులకు ఉత్తర్వులు అందాయి. సబ్సిడీని కుదించడంతో రైతులపై ఒక్కో బస్తాకు రూ.వెయ్యికి పైగా అదనపు భారం పడనుంది. జిల్లాలో 313 జీపీలుండగా ఈ వానాకాలంలో 2.76 లక్షల ఎకరాల్లో వరిసాగులోకి రానుందని అధికారులు అంచనా.

వరి సాగుకు నెల రోజుల ముందు జీలుగ, జనుము, పిల్లిపెసర భూమిలో చల్లుతారు. ఏపుగా పెరిగిన తర్వాత నీటిలో కలియదున్నుతారు. దీంతో ఎకరాకు 5 టన్నుల ఎరువు తయారవుతుంది. గతేడాది 30 కిలోల జీలుగ బస్తా రూ.1116 ఈసారి రూ.2,137 పెరిగింది. ఈ లెక్కన రైతులపై రూ.1,021 అదనపు భారం పడనుంది. పిల్లిపెసర 20 కిలోల బస్తా రూ.1,084 ఉండగా ఈసారి రూ.2055, జనుము 40 కిలోల బస్తాకు రూ.1,448 ఉండగా ఈసారి రూ.2,510 పెరిగింది. మొగిపురుగుతో ఏటా నష్టపోతున్న రైతులకు పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీని కుదించడం రైతులకు ఇబ్బందికరంగా మారనుంది. ఎకరాకు 15 కిలోల విత్తనాలు అవసరం 30 కిలోల బస్తా సుమారు రెండున్నర ఎకరాలలో చల్లుకోవచ్చునని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాలు ఎకరాకు 5 నుంచి 6 టన్నుల ఎరువును ఉత్పత్తి చేస్తుంది. విత్తనాలు చల్లుకున్న తర్వాత 35–40రోజుల మధ్య భూమిలో కలియదున్నుతే మంచిది. ఇందులో 8 కిలోల భాస్వరం, 20 కిలోల పోటాష్, 35 కిలోల నత్రజని ఉంటుంది. అదేవిధంగా పిల్లిపెసర కూడా పచ్చిరొట్ట, పశుగ్రాసంకు ఉపయోగపడుతుంది. జీలుగ మే 15నుంచి సాగు చేయాలి. అదునుదాటి పోతున్న పచ్చిరొట్ట విత్తనాలు సెంటర్లకు రాకపోవడంతో రైతులు కలవరపడుతున్నారు. రోహిణి కార్తెలో నార్లు పోయాల్సి ఉండగా ఇప్పటి వరకు జీలుగ విత్తనాలను అధికారులు తెప్పించకపోవడంతో రైతులు మండిపడతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి పెరిగిన ధరలను తగ్గించాలని రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

పచ్చిరొట్ట విత్తనాలు ఇంతవరకు గోదాములకు రా లేదు. విత్తనాలు రాకముందే ధరలను అడ్డగోలుగా ప్రభుత్వం పెంచినట్లు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందించింది. ఇప్పుడున్న సర్కారు 10 శాతం తగ్గించడం వల్ల ఒక్కో బస్తాపై రూ. వెయ్యి అదనపు భారం పడుతుంది. మాలాంటి చిన్న, సన్నకారు రైతులకు తలకుమించిన భారం. ప్రభుత్వం స్పందించి వెంటనే పెరిగిన ధరలను తగ్గించి రైతులను ఆదుకోవాలి.

– అప్పని హరీశ్ వర్మ, రైతు, రామకృష్ణాపూర్

క్లుప్తంగా

జాతి పునర్నిర్మాణంలో టీచర్ల పాత్ర కీలకం

ఎమ్మెల్సీ మల్క కొమురయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

రామడుగు: జాతి పునర్నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేట్ పాఠశాలలో గురువారం రామడుగు మండల ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ నిర్మాణంలో గుణాత్మక విద్యను అందించడంలో టీచర్ల పాత్ర ముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అంబటి వేణుకుమార్, తపస్ జిల్లా అధ్యక్షుడు కట్ట రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు, సాధన విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాస్‌రావు పలువురు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న అధికారులు

హుజూరాబాద్: భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తెలంగాణ ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పలనర్సింగాపూర్, కేసీ క్యాంప్, దమ్మక్కపేట ఏరియాల్లో మొక్కలు నాటే ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... మహిళా సంఘాల సభ్యులందరూ ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటి తప్పనిసరిగా సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, ఎండీ రషీద్, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి అండగా స్నేహితులు



బాండ్ పేపర్స్ అందిస్తున్న స్నేహితులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామంలో నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన బొడ్డు పర్శరాములు కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. 1995–96 పదోతరగతి స్నేహితులు ఎస్‌కె సిరాజ్, బండెల శ్రీనివాస్, బింగి స్వామి, బి. తిరుపతిరెడ్డి, ఎండీ ఉస్మాన్, శంకరాచారితో పాటు 25 మంది రూ.50 వేలు పోగుచేసి పోస్టాఫీస్‌లో పర్శరాములు కూతురు పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. గురువారం ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌పేపర్స్ మృతుడి కు టుంబ సభ్యులకు అందించారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్తులు వారిని అభినందించారు.

రూ.50,116 విరాళం



విరాళం అందిస్తున్న శంకర్

చొప్పదండి: పట్టణంలోని పురాతన కోదండ రామాలయానికి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న యెలిగేటి శంకర్ గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని రూ.50,116 విరాళం అర్చకులకు అందించారు. త్వరలో కోదండ రామాలయం నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో హరికృష్ణ, జగన్మోహన్ స్వామి, సుధాకర్, విశ్వమోహన్ పాల్గొన్నారు.

బోర్‌వెల్ ప్రారంభం



చొప్పదండి: పట్టణ శివారులోని దుర్గామాత ఆలయం ఆవరణలోని బోర్‌వెల్‌కు గురువారం మోటారు బిగించి ప్రారంభించారు. బోర్‌వెల్‌తో పాటు మోటారు కొనుగోలుకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ఆలయ నిర్వాహకుడు చీకట్ల లచ్చయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వల్లాల కృష్ణహరి, గుర్రం మల్లారెడ్డి, క్యాతం పురుషోత్తం, శ్రీగాద రాజు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, చిన్నజీయర్ స్వామి, భక్తులు

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజస్తంభ, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం వేదమంత్రోచ్ఛరణల మధ్య సాంప్రదాయంగా జరిపించారు. దేవాలయ ఆవరణలోని యాగశాలలో యాగం నిర్వహించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఆలయ చైర్మన్ క్యాస చక్రధర్ దంపతులు పాల్గొన్నారు. యాగం అనంతరం తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం చేపట్టారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు విరాళాలు ఇచ్చిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. చిన్నజీయర్ స్వామి ఆలయ దర్శనం అనంతరం యాగంలో పాల్గొని భక్తులకు ప్రవచనాలు ఇచ్చారు. కార్యక్రమంలో దాతలు మోహన్‌రావు, తిరుపతిరావు, వర్ధినేని రవీందర్‌రావు, గందె శ్రీనివాస్, ముత్యం రాజు, ఆలయ కమిటీ సభ్యులు ఆకుల సదానందం, బుర్ర నటరాజ్, గట్టు మహదేవ్, కాసార్ల శ్రీహరి, యతిపతి అరుణ్ కుమార్, అకినపల్లి శ్రావణ్, క్యాస కమల్ కుమార్, చిదురల నాగరాజు, కరుణ శ్రీ కుమార స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

వీణవంక: మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావును ఎన్‌కౌంటర్ చేయడాన్ని సీపీయూఎస్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రమేశ్ తీవ్రంగా ఖండించారు. ఆపరేషన్ కగార్ పేరుతో బీజేపీ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తోందని, నంబాలతో పాటు మరికొంత మంది మరణించడం బాధాకరమన్నారు. మావోయిస్టులు, ప్రజాస్వామిక వాదులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కోరారు. ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపాంచాలని డిమాండ్ చేశారు.

ఇల్లందకుంట: ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై కాల్పులను సీపీఐ(ఎం) ఖండించింది. గురువారం మండల కేంద్రంలో పార్టీ మండల కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు 27మంది మావోయిస్టులను కేంద్ర బలగాలు ఎన్‌కౌంటర్ చేయడం బాధాకరమన్నారు. కేంద్ర బలగాలు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో కూంబింగ్ పేరుతో దాదాపు 500 మంది నక్సలైట్లను చంపాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రెస్‌మీట్ పెట్టడం అదే విధంగా 2026 మార్చి31వరకు దేశంలో నక్సలైట్లను లేకుండా చేస్తామనడం సరికాదని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చల ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి శాంతియుత వాతావరణానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

రామకృష్ణకాలనీలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదర్శ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని ఆసుపత్రి బృందం ప్రకటించింది. డాక్టర్లు మానస తేజస్విని, ఉదయ్ మాట్లాడుతూ.. గ్రామస్తులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు అందజేస్తున్నామని, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసి ఆరోగ్యం మెరుగయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉంటుందని హామీ ఇచ్చారు. శిబిరం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల అవసరాన్ని తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గుజ్జుల ప్రణీత్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ఆసుపత్రి సీఈఓ కరివేద సత్యనారాయణరెడ్డి, డాక్టర్ సునీల్ రాజ్, కళ్యాణ్, ఆడెపు మానస, హెచ్ఆర్ మేనేజర్ రామకృష్ణ, దుర్గాప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

శంకరపట్నం: మండలంలోని గద్దపాక సహకార సంఘం పరిధిలో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయని సీఈవో శ్రీనివాస్ తెలిపారు. గద్దపాక , కాచాపూర్, కల్వల, రాజాపూర్ కొనుగోలు కేంద్రాల్లో 14 వేల క్వింటాళ్లు, మెట్‌పల్లి సహకార సంఘం పరిధిలో 34,200, తాడికల్ సహకార సంఘం పరిధిలో 42,500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు చేశామన్నారు. వర్షం కారణంగా కొంతధాన్యం ఇళ్లల్లో నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

భాగ్యరెడ్డి వర్మకు నివాళి



నివాళి అర్పిస్తున్న కమిషనర్, అధికారులు

జమ్మికుంట: మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎండీ అయాజ్ ఆధ్వర్యంలో గురువారం భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దళితుల అభ్యున్నతి కోసం స్వాతంత్ర్యం రాక ముందు నుంచి వారికి విద్య అందించాలనే మహా సంకల్పంతో హైదరాబాద్‌లో ప్రత్యేక హాస్టల్ వసతి ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి అని, సాంఘిక, సంక్షేమ కోసం కృషి చేశారని నేటి యువతరం ఆయన బాటలో నడవాలని సమసమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ నరేష్, వికాస్, ఆర్ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, టీపీబీవో దీపికా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, కుమార్, మెగిలయ్య, పాషా, కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజు భాగ్యరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దళితుల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ డి.ప్రశాంత్‌కుమార్, నరేందర్, శ్రీధర్‌రెడ్డి, అంజయ్య, రాజయ్య, రమాదేవి పాల్గొన్నారు.



చొప్పదండిలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: పట్టణంలో నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకుడు గట్టు సాయిరాం డిమాండ్ చేశారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. పాఠశాల నిర్వహణలో బోర్డు ఏర్పాటు చేయకుండా విద్యాశాఖ నియమ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఆరోపించారు. పలుమార్లు ఫిర్యాదు చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్నారు. లేదంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు.

సమాచారం

హుజూరాబాద్ ఏసీపీగా మాధవి



శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్ ఏసీపీగా వాసంశెట్టి మాధవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్‌జీ హైదరాబాద్ డీజీ కార్యాలయానికి బదిలీ కాగా కరీంనగర్ నుంచి మాధవి హుజూరాబాద్‌కు బదిలీపైవచ్చారు. ఏసీపీని మానవ హక్కుల నాయకురాలు లత మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఏసీపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: హుజూరాబాద్ డివిజన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన మాధవిని జమ్మికుంటకు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, మారపల్లి భిక్షపతి, మేడిపల్లి రవీందర్, పొనగంటి సారంగం, దేశిని రాధాసదానందం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

జమ్మికుంట: జమ్మికుంట తహసీల్దార్‌గా నల్ల వెంకట్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాయలం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



మహేందర్

గన్నేరువరం: టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన న్యాయవాది జేరిపోతుల మహేందర్ నియామకమయ్యారు. ఈమేరకు టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేయగా జిల్లా చైర్మన్ కల్లెపల్లి లక్ష్మయ్య నియామకపత్రం అందజేశారని మహేందర్ గురువారం తెలిపారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కల్లెపల్లి లక్ష్మయ్యకు మహేందర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు రాజీవ్ యువవికాస దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ



చిగురుమామిడి: రాజీవ్ యువవికాస పథకానికి దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పది గంటలకునిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఎంపీడీవో మధుసూదన్ గురువారం ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ ఆధారిత పథకాలకు దరఖాస్తు చేసుకున్నవారు భూ సంబంధ పాసు పుస్తకాలు తప్పనిసరిగా తీసుకురావాలని, అలాగే దరఖాస్తుకు జతచేసిన సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. బొమ్మనపల్లి, చిగురుమామిడి, ఇందుర్తి, నవాబుపేట్, రేకొండ, సుందరగిరి గ్రామాలకు చెందిన వారికి శుక్రవారం ఇంటర్వ్యూ ఉందన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న పండితులు

హుజూరాబాద్: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధి ఇప్పలనర్సింగాపూర్ గ్రామంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ దీక్ష స్వాముల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వైభవంగా శ్రీసీతారాముల కల్యాణోత్సవం

రామడుగు: మండలంలోని దత్తోజీపల్లి గ్రామంలో శ్రీహనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ దేవాలయంలో వేదపండితులు శ్రీసీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంట్ల వెంకట్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించగా భక్తులకు అన్నప్రసాదం సింగిల్ విండో ఉపాధ్యక్షుడు గంట్ల రవీందర్‌రెడ్డి చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని శ్రీపొంబండ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సందర్శించారు.



దత్తోజీపల్లిలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం

హనుమాన్ పెద్దజయంతి, విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఆలయాన్ని సందర్శించగా వేదపండితులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. వెంట హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవీందర్, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి ఉన్నారు.

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామంలో రావిచెట్టు చౌరస్తా బృందం ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయంలో వేడుకలు నిర్వహించి భక్తులకు పండ్లు, తీర్థప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలోలక్ష్మీనారాయణ, ఆటికం సందీప్, వరుకోలు నరేశ్, బుర్ర శ్రీనివాస్, జంపి, ఇరుమండ్ల ఏల్లేష్, గడ్డమీది రాజు, అటికం అజయ్, రాపోలు అనిల్, భానుచందర్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం, వంకాయగూడెం, తాడికల్, కొత్తగట్టు, కన్నాపూర్ తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలను భక్తులు దర్శించారు.



గన్నేరువరం: జంగపల్లిలో హనుమాన్ జయంతి



శంకరపట్నం: వంకాయగూడెంలో ..

ఇంటి స్థలం విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవ

- గొడ్డలితో దాడి చేయగా అడ్డుకోబోయిన వదినకు తీవ్ర గాయాలు

ఇల్లందకుంట: ఇంటి స్థలంవిషయంలో జరిగిన గొడవలో మండల పరిధిలోని గడ్డివానిపల్లికి చెందిన ఎలవేని అనూష గురువారం తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాలు...గ్రామానికి చెందిన ఎలవేని ఐలయ్య సమ్మక్క దంపతులకు ఇద్దరు కొడుకులు పెద్ద కుమారుడు హరీశ్, చిన్నకుమారుడు అజయ్ మధ్య ఇంటి స్థలం విషయంలో కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతుంది. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీ నిర్వహించినా వివాదం కొలిక్కిరాలేదు. గురువారం ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతుండగా అజయ్, అజయ్‌మామ ఇంట్లో ఉన్న గొడ్డలితో హరీశ్‌పై దాడికి యత్నించగా అడ్డుకోబోయిన అజయ్ వదిన అనూష తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెకు జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మృతి

మానకొండూర్: మండలంలోని ఊటూర్ కి చెందిన గాజుల తరుణ్ (24), గంగిపల్లికి చెందిన సముద్రాల రమేష్ (39) చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. మానకొండూర్ సీఐ సంజీవ్ తెలిపిన వివరాలు .. తరుణ్ గత కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. బాధను భరించలేక ఈ నెల 19న పొలం వద్ద పురుగు మందు సేవించాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చేర్పించారు. రమేష్ కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన ఈ నెల 20 పురుగుల మందు సేవించాడు. ఆసుపత్రిలో చేర్పించగా బుధవారం రాత్రి ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతుడు రమేష్‌కు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

అదృశ్యం కేసు

జమ్మికుంట: పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యం కాగా గురువారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామానికి చెందిన పాడేటి దుర్గయ్య బుధవారం పని ఉందని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య మరియ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

శంకరపట్నంలో భారీ వర్షం

శంకరపట్నం: మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. కేశవపట్నం ప్రధాన రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలు నెమ్మదిగా ముందుకు కదలాయి.

గొర్రెల కాపరులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

కరీంనగర్: పిడుగుపడి చనిపోయిన గొర్రెలు, మేకల కాపరుల కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందబోయిన ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పిడుగుపాటుకు గుర్రై రాష్ట్రవ్యాప్తంగా వందలాది గొర్రెలు, మేకలు మృతి చెందాయన్నారు. రాష్ట్రంలోని గొర్రెలకు ప్రభుత్వం ఉచి త బీమా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.

బాల సదన్, శిశుగృహ సందర్శన

కరీంనగర్‌క్రైం: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్ నగరంలోని బాలసదన్, శిశుగృహాలను గురువారం సందర్శించారు. అక్కడి చిన్నారులతో మాట్లాడారు. కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయిలో స్థిరపడాలని సూచించారు. బాలసదన్, శిశుగృహాలలోని వంటగదులు, ఆహార పదార్థాలు నిల్వచేసే ప్రదేశాలను తనిఖీ చేశా రు. చదువులో నైపుణ్యం ప్రదర్శించిన పలువు రు విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎలాంటి న్యాయపరమైన సేవలు అవసరమైన న్యాయసేవాధికార సంస్థలను సంప్రదించవలసిందిగా నిర్వాహకులకు సూచించారు.

పలు రైళ్ల కోసం వినతి

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేసి ప్రారంభించిన సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను గురువారం ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం జనరల్ సెక్రెటరీ కలవేని శ్రీనివాస్ కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ నుండి సికింద్రాబాద్ (వయా పెద్దపల్లి) నమో భారత్ ర్యాపిడ్ రైలును ప్రవేశ పెట్టాలని, తిరుపతి నుంచి కరీంనగర్ ప్రతీ రోజు నడపాలని, బల్లార్షా నుంచి కాజీపేట ఎక్స్‌ప్రెస్ రైలును చర్లపల్లి టెర్మినల్ వరకు పొడిగించాలని, నిజామాబాద్ నుండి కాజీపేట పుష్ పుల్ మెము ఎక్స్‌ప్రెస్ రైలును వయా కరీంనగర్ మీదుగా, కరీంనగర్ మీదుగా తెలంగాణ సంపర్క్ క్రాంతి రైలును ప్రవేశ పెట్టాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో వి.గంగాధర్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 2,897మందికి 252మంది గైర్హాజరు అయ్యారని, 2,645మంది పరీక్ష రాశారని తెలిపారు. ఒకేషనల్‌లో 347మందికి 25 మంది గైర్హాజరు అయ్యారని, 322మంది పరీక్ష రాశారని తెలిపారు. మొత్తంగా 3,244 మందికి 277మంది గైర్హాజరు అయ్యారని, 2,967మంది విద్యార్థులు పరీక్షలు రాశారని పేర్కొన్నారు.